అయినవారికే రుణాలు!

- కాపు, బీసీ రుణాల మంజూరులో అసలైనవారికి మొండి చేయి
- కూటమి నేతల సిఫార్సులకే ప్రాధాన్యం


ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరైన దరఖాస్తుదారులు


ఆయా బ్యాంకుల అధికారులతో చర్చిస్తున్న పెద్దాపురం మున్సిపల్ కమిషనర్

పెద్దాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, జాబ్ రాకపోతే నిరుద్యోగ యువతకు నెలనెలా భృతి ఇచ్చి ఆదుకుంటామని ఆ పార్టీల నేతలు ఎన్నికల ముందు ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనలో, నిరుద్యోగ భృతి చెల్లింపులో ప్రభుత్వం విఫలమైంది. ఉన్నత చదువులు చదివి ఉద్యోగ అవకాశాలు లేకపోయినప్పటికీ స్వయం ఉపాధి అవకాశాలతో తమ సొంత కాళ్లపై నిలబడుదామనుకునే యువతకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కూడా కరువవుతోంది. వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుందామనుకునే యువతకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం ముఖం చాటేస్తుందనేందుకు బీసీ, కాపు కార్పొరేషన్ రుణాలే ఉదాహరణ. తాజాగా ప్రభుత్వం బీసీ, కాపు కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ రుణాలకు నియోజకవర్గంలో రెండు పట్టణాలు, రెండు మండలాలు కలిపి సుమారు 301 రుణాలు మంజూరు కాగా ఆయా రుణాలకు ఆన్‌లైన్‌లో సుమారు ఆరు వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు. పెద్దాపురం పట్టణానికి 87 యూనిట్లు, మండలానికి 61 యూనిట్లు, సామర్లకోట పట్టణానికి 90 యూనిట్లు, మండలానికి 63 యూనిట్లు లక్ష్యం పెట్టుకుంది. రుణం మంజూరైతే వ్యాపారం ప్రారంభించాలనుకుని, మంచి వ్యాపార ఆలోచనతో ముందుకు వస్తున్న యువతకు కూటమి నేతలు మోకాలడ్డుతున్నారు. అర్హతతో సంబంధం లేకుండా తాము చెప్పిన ఎమ్మెల్యే సిఫారసు లేఖతో వచ్చిన వారికే రుణాలు ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. దీంతో అధికారులు వారి మాటలకు తలొగ్గి వారు ఇచ్చిన పేర్లు మాత్రమే బ్యాంకులకు పంపిస్తున్నారు.

అర్హులకు అన్యాయం

మండల, మున్సిపల్, బీసీ కార్పొరేషన్ అధికారులు అర్హులకు అన్యాయం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రుణాలకు సంబంధించి తాజాగా అధికారులు ఇంటర్వ్యూలు చేశారు. ఈ ప్రక్రియ అంతా పేరుకేనని, ఎవరికి రుణాలు ఇవ్వాలన్నది టీడీపీ, జనసేన నాయకులు నిర్ణయిస్తున్నారని నిరుద్యోగ యువత ఆరోపిస్తున్నారు. గ్రామాల నుంచి కూటమి నేతలు ఇప్పటికే వారికి నచ్చిన ఇద్దరు, ముగ్గురు పేర్లతో జాబితాను ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాలకు అందజేశారు. వారికి మాత్రమే రుణాలు మంజూరయ్యేలా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో నిజమైన అర్హులు అన్యాయమైపోతున్నారనే చర్చ అంతటా జరుగుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో ఎటువంటి సిఫారసులు లేకుండానే అర్హులకు సంక్షేమ పథకాలు, రుణాలు మంజూరయ్యేవని యువత చర్చించుకుంటున్నారు.

అర్హులందరికీ మంజూరు చేస్తాం



అర్హులందరికీ బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేస్తాం. అర్హుల వివరాలతో కూడిన జాబితాను బ్యాంక్‌లకు పంపాము. లబ్ధిదారుల మంజూరులో ఎలాంటి రాజకీయ జోక్యం లేదు.

– కేవీ పద్మావతి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

యూనిట్లను బట్టే రుణాలు



మండలానికి మంజూరైన యూనిట్లను బట్టి రుణాల మంజూరు చేస్తాం. మండలానికి 61 యూనిట్లు మంజూరు కాగా సుమారు 2500 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అర్హత, బ్యాంక్ విల్లింగ్‌ను బట్టి రుణాల మంజూరుకు చర్యలు చేపట్టాం. – శ్రీలలిత, ఎంపీడీఓ, పెద్దాపురం

లాడ్జిలలో విస్తృత తనిఖీలు


సామర్లకోటలో లాడ్జిని తనిఖీ చేస్తున్న డీఎస్పీ, సీఐ తదితరులు

సామర్లకోట: పట్టణ పరిధిలోని లాడ్జిలలో శనివారం రాత్రి పోలీసు అధికారులు విస్తృత తనిఖీలు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ డి.శ్రీహరిరాజు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేశారు. రాత్రి 8 నుంచి 10 గంటల వరకు లాడ్జీలలో దిగే వారి వివరాలను పోలీసులు సేకరించారు. గంజాయి, మత్తు పదార్థాలు, అసాంఘిక కార్యక్రమాలు లాడ్జీలలో జరుగుతున్నాయనే ఫిర్యాదులతో ఈ తనిఖీలు చేశారు. రైల్వే స్టేషన్, ఏడీబీ రోడ్డు అందుబాటులో ఉండటం వల్ల మత్తు పదార్థాలు ఎక్కువ రవాణా జరిగే అవకాశం ఉన్నదని వాటిపై దృష్టి సారించాలనే ఈ తనిఖీలు చేస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఆయా లాడ్జీలలో సీసీ కెమెరాల పని తీరు, సీసీ కెమెరాల ఫుటేజీ రికార్డింగ్‌లను పరిశీలించారు. లాడ్జీలలో దిగే వారి వివరాలతో కూడిన ఆధార్ కార్డు జెరాక్స్ లాడ్జీల నిర్వాహకుల వద్ద ఉండాలని ఆదేశించారు. లాడ్జీలలో అనుమానంగా ఉన్న బ్యాగ్‌లను పరిశీలించారు. ఈ తనిఖీల్లో సీఐ ఎ.కృష్ణభగవాన్, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిఠాపురంలో రేపు పీజీఆర్ఎస్

పిఠాపురం: ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ఈ నెల 21వ తేదీ సోమవారం పిఠాపురం మున్సిపల్ అతిథిగృహం వద్ద గల పాడా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పీడీ ఏ.చైత్ర వర్షిణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించిన డివిజనల్, మండల స్థాయి అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆమె ఆదేశించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమతమ అర్జీలను అందజేయాలని ఆమె కోరారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

అగ్నిమాపక అధికారి రామకృష్ణ రాజు


అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పిఠాపురం: అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై శనివారం స్థానిక అగ్నిమాపక సిబ్బంది అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి డి.రామకృష్ణం రాజు మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఈనెల 14 నుంచి 20 వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సీఎంసీ, కార్తికేయ ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలు, నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఆస్పత్రుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు పదవీ విరమణ సత్కారం


కొత్తపల్లిలో రమణమూర్తి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

పిఠాపురం: విద్యార్థుల భవితను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని వైఎస్సార్ సీపీ నాయకుడు రావు చిన్నారావు అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసిన చేబోలు వెంకట రమణమూర్తి పదవీ విరమణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణమూర్తి దంపతులను శాలువా, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు


నిందితుడితో ఎక్సైజ్ అధికారులు

సామర్లకోట: మండల పరిధిలో వీకే రాయపురంలో సారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు శనివారం ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. ఈ దాడిలో గ్రామానికి చెందిన అజంగి వీరభద్రరావును అరెస్టు చేసి అతని వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ కె.రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. దాడిలో ఎస్సై ఎంవీవీ కుమార్, సిబ్బంది వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నట్లు సీఐ తెలిపారు.

సొంత వైద్యం ప్రమాదకరం

బోట్‌క్లబ్: వైవాహిక జీవితం, జీవన విధానంలో సొంత వైద్యాన్ని ఆచరించడం ప్రమాదకరమని ప్రముఖ వైద్యుడు టీవీకే కార్తిక్ హరీన్ అన్నారు. రోటరీ గోల్డెన్ జుబ్లీక్లబ్ సమావేశం స్థానిక రోటరీ హాల్లో శనివారం నిర్వహించారు. వైద్యులు కార్తిక్ మగవారి లైంగిక ఆరోగ్యంపై మాట్లాడుతూ పొగ తాగడం, మద్యం సేవించడం వంటి వ్యసనాలకు మగవారు దూరంగా ఉండాలన్నారు. మంచి ఆహారపు అలవాట్లు, సరైన వ్యాయామం ద్వారా చక్కని ఆరోగ్యం పొందవచ్చని సూచించారు. అనంతరం రోటరీ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు, అసిస్టెంట్ గవర్నర్ ధనసాగర్ ప్రసాద్, సభ్యులు కార్తిక్‌ను సత్కరించారు.

సారాతో మహిళ అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఏలేశ్వరం మండలం తిరుమాలిలో శనివారం పది లీటర్ల సారాతో మహిళను అరెస్టు చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి. శివప్రసాద్ తెలిపారు. తిరుమాలిలో సారా విక్రేతలపై దాడులు నిర్వహించగా అంచూరి నూకరత్నంను అదుపులోకి తీసుకుని, ఆమె నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఐక్య పోరాటం

- ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎం చిష్టి


సమావేశంలో మాట్లాడుతున్న చిష్టి

పెద్దాపురం: వక్ఫ్ ఆస్తులను కాజేసేందుకు మోడి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎం చిష్టి విమర్శించారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో శనివారం పట్టణ పౌర సంక్షేమ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ అధ్యక్షతన లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ‘వక్ఫ్ చట్ట సవరణ పర్యవసానాలు’ పేరుతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిష్టి మాట్లాడుతూ ఈ చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు. బీజేపీ కళ్లు వక్ఫ్ ఆస్తులపై పడ్డాయన్నారు. ఇప్పుడు ముస్లింల మీద పడ్డారని, తరువాత మిగిలిన మతాల మీద పడతారన్నారు. ఈ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమం లౌకిక దృక్పథంతో సాగాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దువ్వా శేషుబాబ్జీ, వక్ఫ్ సవరణ వ్యతిరేక జాయింట్ యాక్షన్ వేదిక కన్వీనర్ మహ్మద్ ముక్తార్ అలీ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులపై బీజేపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. పాస్టర్ల సంఘం నియోజకవర్గ కన్వీనర్ లంక పురుషోత్తమ్ దాస్ మాట్లాడుతూ ఈ చట్టానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో షాహి జామియా మసీద్ అధ్యక్షులు అసిక్ ఆలీ, జామీయా మసీద్ అధ్యక్షులు సయ్యద్ అబ్దుల్ ఖాదర్, చోటీ మసీద్ అధ్యక్షులు ఎస్‌కే గౌస్, సీపీఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు, ముస్తాఫా, సుకుమార్, స్టీఫెన్ చందూ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్

సామర్లకోట: స్థానిక సీబీఎం హైస్కూల్ ఆవరణలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ రన్ ఫర్ జీసస్‌ను శనివారం జెండా ఊపి ప్రారంభించారు. శుక్రవారం క్రీస్తుకు సిలువ వేయగా మరణించిన మూడో రోజున సమాధిని గెలిచి పునరుత్థానుడై లేచిన సందర్భాన్ని చాటి చెప్తూ క్రైస్తవులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సీబీఎం హైస్కూల్ నుంచి బ్రౌన్‌పేట, పాత పోలీసు స్టేషన్, మున్సిపల్ కార్యాలయం, గాంధీచౌక్, స్టేషన్‌సెంటర్, మఠంసెంటర్ మెహర్ కాంప్లెక్స్, సీహెచ్‌సీ మీదుగా సెంటినరీ బాప్టిస్టు చర్చి వద్ద పరుగు ముగిసింది. దీనిలో భాగంగా స్థానిక గడియారం స్తంభం వద్ద మండల పాస్టర్ల సంఘ ప్రతినిధులు రన్ ఫర్ జీసస్ ప్రాధాన్యాన్ని వివరించారు. మండల పాస్టర్ల సంఘ ప్రతినిధులు డాక్టర్ టి.బ్లెసింగ్, కె.జయబాబు, వై.కరుణాకర్, పి.తిమోతి తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాప్టిస్టు కౌన్సిల్ అధ్యక్షుడు సల్లూరి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.


పెద్దాపురంలో దైవజనులు, పురప్రజల ర్యాలీ


సామర్లకోట రన్ ఫర్ జీసస్‌లో యువత

క్లాప్స్ ఆధ్వర్యంలో..

పెద్దాపురం: క్లాప్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం రన్‌ఫర్ జీసస్ నిర్వహించారు. స్థానిక లూథరన్ చర్చి వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీని క్లాప్స్ వ్యవస్థాపకుడు రన్ ఫర్ జీసస్ కో-ఆర్డినేటర్ లంక పురుషోత్తమ్ దాసు జెండా ఊపి ప్రారంభించారు. ఈ రన్ ద్వారా ప్రతి ఒక్కరూ శారీరక, మానసికోల్లాసంతో పాటు ఆధ్యాత్మికత అలవరచుకోవచ్చన్నారు. దైవ జనులు డి.వెంకట్‌పాల్, బి.విద్యాసాగర్, తలారి విజయ్‌కుమార్, పరంజ్యోతిమ్మలు ప్రార్థనలు చేయగా స్థానిక మున్సిపల్ సెంటర్, మెయిన్‌రోడ్డు, దర్గా సెంటర్, పాత బస్టాండ్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు రన్ ఫర్ జీసస్ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో పి.జాన్, సీబీఐ సుకుమార్, గిద్యోను, జ్యోతిబాబు, సాల్మన్ రాజ్, తలారి విజయ్‌కుమార్, పల్లా చిన్ని తదితరులతో పాటు పట్టణ ప్రముఖులు, దైవజనులు, విశ్వాసులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్ర భూముల కౌలు వేలం

- ఆలయానికి ఏడాదికి రూ.7.04 లక్షల ఆదాయం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయానికి భీమవరంలో ఉన్న భూములను కౌలు ద్వారా సాగు చేసుకోవడానికి బహిరంగ వేలం నిర్వహించినట్టు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆలయానికి చెందిన 22.89 ఎకరాల భూమిని సాగు చేసుకోవడానికి వేలం నిర్వహించిన్నట్టు తెలిపారు. ఈ మేరకు ఏడాదికి కౌలుగా రూ.7.04 లక్షలు చెల్లించడానికి కొలమురి బూరయ్యను హెచ్చు పాటదారునిగా గుర్తించినట్టు తెలిపారు. కౌలుదారుకు మూడేళ్ల పాటు భూమిని సాగు చేసుకొనే హక్కు ఉంటుందని చెప్పారు. గతంలో రూ.5.88 లక్షలు కౌలుగా ఉండగా ప్రస్తుతం రూ.1.24 లక్షలు అదనంగా ఆదాయం వచ్చిందన్నారు. సామర్లకోట గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వాహణాధికారి బిక్కిన వెంకట్రాయ చౌదరి పర్యవేక్షణలో పాట జరిగిందని, ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖాధికారి ఈవీ సుబ్బారావు, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ కంటే బాబులు పాల్గొన్నారని తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కరప: 2025–26 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు లాటరీ పద్ధతిలో ఉచితంగా కేటాయించేందుకు మార్గదర్శకాలతో కూడిన షెడ్యూల్ విడుదలైనట్టు ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణలు తెలిపారు. కరపలో శనివారం ఎంఈఓలు స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఈ నెల 26వ తేదీలోగా సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని, 28వ తేదీ నుంచి విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని వివరించారు. ఎవరికైనా సందేహాలుంటే మండల విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఎంఈఓలు సూచించారు.

సరిహద్దు తగాదాలో మహిళకు గాయాలు

కరప: సరిహద్దు విషయమై ఇద్దరు మహిళల మధ్య జరిగిన కొట్లాటలో ఒకరికి తీవ్ర గాయాలై కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతోంది. పోలీసుల కథనం మేరకు మండలం గొర్రిపూడి గ్రామంలో పడాల రంగమ్మ, గండి వెంకటలక్ష్మిల మధ్య తరచుగా సరిహద్దు గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 18వ తేదీన సాయంత్రం రంగమ్మ, వెంకటలక్ష్మిల మధ్య మళ్లీ సరిహద్దు విషయమై గొడవ పడ్డారు. ఈ ఘర్షణలో వెంకటలక్ష్మి చెక్కబద్దతో రంగమ్మ తలపైన కొట్టగా తప్పించుకునే ప్రయత్నంలో ముఖంమీద, ఎడమ కనుబొమ్మపైన రక్తపు గాయమైంది. ఆమెను వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్సపొందుతోంది. బాధితురాలు శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీయూడబ్ల్యూజేతో జర్నలిస్టుల సంక్షేమం

జిల్లా అధ్యక్షుడు స్వాతి ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న స్వాతి ప్రసాద్

పెద్దాపురం: జర్నలిస్టు సమస్యల పరిష్కారం ఏపీయూడబ్ల్యూజేతోనే సాధ్యమని యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.స్వాతి ప్రసాద్ అన్నారు. జిల్లా నూతన కమిటీ ఏర్పాటులో భాగంగా శనివారం స్థానిక మరిడమ్మ ఆలయ కాలక్షేప కళ్యాణ మండపంలో జిల్లా అడ్‌హాక్ కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి సుంకర ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. స్వాతిప్రసాద్ మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలపై స్పందించే యూనియన్, జర్నలిస్టుల ఐక్యత చాటే అతి పెద్ద యూనియన్ ఏపీయూడబ్ల్యూజే మాత్రమేనన్నారు. త్వరలో జిల్లా నూతన కమిటీ ఏర్పాటులో భాగంగానే అడ్‌హాక్ కమిటీ సమావేశం ద్వారా మే మొదటి వారంలోనే జిల్లా నూతన కమిటీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. యూనియన్ బలోపేతమే లక్ష్యంగా నూతన కమిటీ ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. అనంతరం వచ్చే నెలలో నిర్వహించే యూనియన్ నూతన కార్యవర్గ ఏర్పాట్లుపై కమిటీలో చర్చించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు అంజిబాబు, ఆర్.రాంబాబు, దేవవరపు కృష్ణార్జున్, శ్రీనివాస్, అడపా వెంకట్రావు, సురేష్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ చైత్ర మాసోత్సవాలు ప్రారంభం


కనకదుర్గ అమ్మవారి ఆలయంలో లక్ష కుంకుమార్చన చేస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి చైత్రమాస జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారి ఆలయంలో పండితులు కలశస్థాపన, మండపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు రుత్విక్కులకు దీక్షా వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం రుత్విక్కులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. 11 గంటలకు అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ నెల 27న చైత్ర అమావాస్య వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు అమ్మవారికి లక్ష కుంకుమార్చన, రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు గరగల సంబరం నిర్వహిస్తామని వివరించారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరబట్ల గంగబాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణానికి అధిక ప్రాధాన్యం


పాఠశాలలో పరిసరాలను శుభ్రం చేస్తున్న అధికారులు


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


రాజీవ్ గృహకల్పలో రోడ్లు శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

- స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర జిల్లా ఇన్‌చార్జి వీరపాండ్యన్

పిఠాపురం: ప్రభుత్వం పర్యావరణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర జిల్లా ఇన్‌చార్జి అధికారి జి.వీరపాండ్యన్ అన్నారు. శనివారం పిఠాపురం బాదం మాధవరావు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. సీఎం, డిప్యూటీ సీఎం ఈ కార్యక్రరమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని, మూడు నెలలుగా ఒక్కొక్క అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు పర్యావరణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన ఇన్‌చార్జ్ మర్రెడ్డి శ్రీనివాసు, పాడా పీడీ ఎ.చైత్ర వర్షిణి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. ఎలక్ట్రానిక్, ఎలక్ట్రిక్ వ్యర్థాలతో కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ పాఠశాల విద్యార్థులు వేసిన రంగవల్లులను పరిశీలించారు.

విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఇంటర్మీడియట్ ఫలితాలలో 928 మార్కులు సాధించిన దీప్తి గ్రేస్ ను సత్కరించి అభినందనలు తెలిపారు. పాఠశాల నుంచి యోగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమలు అందజేశారు. పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కనకారావు, పాఠశాల హెచ్‌ఎం జి.శ్యామ్‌బాబు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర అందరి బాధ్యత

సామర్లకోట: స్వచ్ఛ ఆంధ్ర కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. ప్రతి మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా స్థానిక రాజీవ్ గృహకల్ప వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో అధికారులతో పాటు ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఈ మేరకు స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో భాగంగా రాజీవ్ గృహకల్ప వద్ద రోడ్లను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ కె.కనకరాజు అధ్యక్షత వహించగా కొడా చైర్మన్ తుమ్మల బాబు, కౌన్సిలర్ బలుసు వాసు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, పంచారామ క్షేత్ర మాజీ చైర్మన్ కంటే బాబు తదితరులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ కార్యాలయంలో....

స్థానిక బ్రౌన్‌పేటలో ఉన్న ఏపీ ఈపీ డీసీఎల్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ప్రభాకర్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ నిర్వహించారు. ఈ మేరకు కార్యాలయ ఆవరణను శుభ్రం చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ కిరణ్, ఏఈ రమేష్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

బచ్చు ఫౌండేషన్ పాఠశాల ఆధ్వర్యంలో..

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులచే శనివారం స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏఎల్‌వీ కుమారి, జి.గోవిందు, కేవీ సత్యనారాయణ, కె.శ్రీనివాసు, కె.అరుణ, సీహెచ్ భద్ర, శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని వాకతిప్ప సర్పంచ్ పాలని దొరబాబు అన్నారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద శనివారం వైద్యాధికారి శ్వేత ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఈ వ్యర్థాలతో’ పెనుముప్పు

- రంగరాయ వైద్య కళాశాలలో సదస్సు
- గ్యాడ్జెట్ల రీ సైక్లింగ్‌పై అవగాహన

కాకినాడ క్రైం: వినియోగించని ఈ–వ్యర్థాలతో భావితరానికి అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని, ఆ పరిస్థితులకు అనుగుణంగా ముందే చికిత్సా పద్ధతులను కనుగొనాల్సిన ఆవశ్యకత మేధావులు సూచిస్తున్నారు. స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ అధ్యక్షతన రీ సైకిల్ యువర్ ఈ–వేస్టేజ్ పేరున సదస్సు నిర్వహించారు. స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ సదస్సుకి ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, ఏపి డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజరుకాగా, గౌరవ అతిథులుగా స్థానిక ఎంఎల్ఏ వనమాడి వెంకటేశ్వరరావు, ఎంఎల్‌సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జీజీహెచ్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు డాక్టర్ కొండమూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

డాక్టర్ నరసింహం మాట్లాడుతూ ఈ–వ్యర్థాల నిర్వహణ మానవాళితో పాటు పర్యావరణ పరిరక్షణకు అత్యంత కీలకమైనదన్నారు. రీసైకిలింగ్ విధానం ద్వారా ఎలక్ట్రానిక్ పరికరాలను పునర్వినియోగించే మార్గాలను అనుసరించాలన్నారు. అనుమతిచ్చిన కేంద్రాలలోనే ఈ–వ్యర్థాలను విడిచిపెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జీజీహెచ్‌లో సమస్యలను నాయకులకు వివరించారు. పాత బ్లాకుల స్థానంలో కొత్త బ్లాకులు నిర్మించాలని అన్నారు. టీబీ ఆసుపత్రి పాడుబడి రోగులకు సేవలందించడంలో తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయని, ఎంసీహెచ్ బ్లాక్‌ని రామ్‌కోశ బృందం నిర్మిస్తున్నా పరికరాల సమకూర్చాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య విద్యార్థుల వసతి గృహాలు నిర్మాణం పూర్తిగా నిలిచిపోయాయని సదరు సమస్యల పరిష్కరించి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేందుకు, అలాగే వైద్య విద్యార్థుల చదువు సక్రమంగా సాగేందుకు దోహదపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ (అకడమిక్స్) డాక్టర్ శశి, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎంపిఆర్ విఠల్, డాక్టర్ శ్రీనివాసన్, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు సహా వైద్య, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.